బస్టాండ్ వరకు రాని బస్సులు

- ప్రయాణికులకు అవస్థలు
- అలంకారప్రాయంగా షెల్టర్

కుక్కునూరు: మండల కేంద్రమైన కుక్కునూరులో ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైన, దుకాణాల వద్ద నిరీక్షించాల్సివస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం డిపో పరిధిలో ఉన్న కుక్కునూరు బస్టాండ్‌కు భద్రాచలం, మణుగూరు, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, తాడేపల్లిగూడెం తదితర డిపోలకు చెందిన బస్సులు కుక్కునూరు మీదుగా రాకపోకలు సాగించేవి. బస్సులు బస్టాండ్ వరకు వచ్చి వెళ్లేవి. బస్టాండ్ నిర్వహణ కూడా భద్రాచలం డిపో అధికారులే చూసుకునేవారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కుక్కునూరు బస్టాండ్ జంగారెడ్డిగూడెం డిపో పరిధిలోకి వచ్చింది. అప్పటి నుంచి జంగారెడ్డిగూడెం డిపో అధికారులు బస్టాండ్‌ను పట్టించుకోక పోవడం, బస్టాండ్‌కు వెళ్లాలంటే బస్సులు లోపలికి ఒక కిలోమీటరు వరకు వెళ్లాల్సి ఉండడంతో బస్సులను డ్రైవర్లు బస్టాండ్‌కు తీసుకెళ్లకుండా మెయిన్ సెంటర్ వరకే పరిమితం చేశారు. దీంతో బస్టాండ్ అలంకారప్రాయంగా మారింది.

ప్రధాన సెంటర్‌లో పడిగాపులు

ప్రయాణికులు బస్సుల కోసం కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రధాన సెంటర్ కావడంతో బస్సుల కోసం వేచి చూసే సమయంలో ప్రయాణికులకు ముఖ్యంగా చిన్నారులు, మహిళలకు టాయిలెట్ సౌకర్యం లేక నానాఅవస్థలు పడుతున్నారు. అంతేకాక ఆర్టీసీ బస్సులను ప్రధాన సెంటర్‌లో నిలపడంతో నిత్యం రద్దీగా ఉండే ఆర్అండ్‌బీ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మంచి ఆదాయం ఉన్న రూట్లో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా కుక్కునూరు బస్టాండ్ వరకు బస్సులు నడిపేలా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో అశ్వారావుపేట రహదారికి సమీపంలో అన్ని సౌకర్యాలతో నూతన బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికులు కోరతున్నారు.



కుక్కునూరులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్



ప్రధాన సెంటర్‌లో బస్సులు నిలపడంతో ట్రాఫిక్ జామైన దృశ్యం

బస్టాండ్ లేక ఇబ్బందులు



కుక్కునూరులో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ పక్క మహిళలు గంటల తరబడి బస్సుల కోసం మెయిన్ సెంటర్‌లో నిరీక్షించేప్పుడు కాలకత్యం తీర్చుకునే పరిస్థితి ఎదురైతే వారి పరిస్థితి వర్ణనాతీతం. ఇక్కడి పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోని అశ్వారావుపేట రహదారికి సమీపంలో బస్టాండ్‌ను నిర్మించాలి. లేదా ప్రస్తుతం ఉన్న బస్టాండ్ వరకు బస్సులు వెళ్లేలా చర్యలు చేపట్టాలి.

– యర్నం సాయికిరణ్, సీఐటీయూ మండల కార్యదర్శి, కుక్కునూరు

క్లుప్తంగా

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



స్వామి వారి కల్యాణ వస్త్రాలను అర్చకునికి అందిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి జన్మన క్షత్రం పూర్వాభాద్ర కావడంతో మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో సోమవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలు వీరే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. జూనియర్ విభాగంలో బుట్టాయగూడెంకు చెందిన వి.సాహిత ప్రథమ, ఎల్ ప్రీతి ద్వితీయ, ఎస్ హన్విత తృతీయ, సీనియర్ విభాగంలో టి.జాహ్నవి, ఎస్ దీప్తి, ఎ.మౌనికలు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. పూర్తి భగవద్గీత కంఠస్థ పోటీల్లో జూనియర్ విభాగంలో ఎం.తులసి సహస్ర, సీనియర్ విభాగంలో బి.కమల(జంగారెడ్డిగూడెం) ప్రథమ, కె.శ్రీలక్ష్మి (దర్భగూడెం) ద్వితీయ, వి.సుధా కుమారి (లక్కవరం) తృతీయ బహుమతు సాధించినట్టు తెలిపారు.

శ్రీవారికి ఇరుముడుల సమర్పణ



తూర్పు రాజగోపురం వద్ద ఇరుముడులతో గోవింద స్వాములు

ద్వారకాతిరుమల: శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా అంటూ గోవింద దీక్షాధారులు చినవెంకన్నకు సోమవారం ఇరుముడులు సమర్పించారు. మండలంలోని వెంకట కృష్ణాపురానికి చెందిన 35 మంది గోవింద స్వాములు ఇరుముడులతో క్షేత్రానికి పాదయాత్రగా విచ్చేశారు. ముందుగా వారంతా గిరి ప్రదక్షిణ చేసి, ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో భజనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి, ఇరుముడులు సమర్పించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ దువ్వాడ



శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్, మాధురి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. దివ్వెల మాధురితో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ అధికారుల శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో పలువురు భక్తులు శ్రీనివాస్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

క్రీస్తు జీవనం ఆదర్శనీయం



క్రిస్మస్ వేడుకల్లో కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవన గమనం ఆదర్శనీయమని జాతీయ వ్యాక్యోపదేశకులు ఎస్ ప్రేమరాజు అన్నారు. బుట్టాయగూడెంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రేమరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం మానవ చరిత్రను మలుపుతిప్పిందన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెంకు చెందిన నామా శ్రీనివాసరావు, పాస్టర్లు సీహెచ్ అలెగ్జాండర్, కె.డానియేలు, జి.ఫిలిప్, ఎస్ ఇస్సాకు, షేక్ బషీర్‌పాల్, టి.కుమార్‌పాల్, కె.జార్జిముల్లర్, టి.పాల్, పి.దావీదు తదితరులు పాల్గొన్నారు.

బంగారు వస్తువుల చోరీ



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సైలు

పోలవరం రూరల్: బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం చోరీ కేసు నమోదు చేశామని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎల్ఎన్‌డీపేట కొత్తపేటకు చెందిన కామన లక్ష్మీ దుర్గాప్రసాద్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు 4 గ్రాముల బంగారు వస్తువులు దొంగిలించారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. సీఐ బాల సురేష్‌బాబుతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొయ్యలగూడెం: కుంతలగూడెం సమీపంలో సోమవారం సాయంత్రంపేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. వీరి నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ విడుదల

చింతలపూడి : సీపీఎం ఏలూరు జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పి.పాండురంగారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయిగూడెంలో మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలుత ప్రజా నాట్యమండలి కళాకారుడు గాదె సుబ్బారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎస్ సూర్యకుమార్, సత్యనారాయణ, రాహుల్ అనురాధ, ధర్మారావు, గోపాల లక్ష్మి, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: పొంగుటూరు జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని నక్కా మమతకు ఎన్నారై రామిరెడ్డి రూ.5 వేలు సాయం సోమవారం అందించారు. రామిరెడ్డికి ఉపాధ్యాయుడు కొండలరావు, హెచ్ఎం రామరాజు, విద్యార్థిని బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ లెక్కల మాస్టారు మాకొద్దంటూ నిరసన

కామవరపుకోట: మండలంలోని అంకాలంపాడు గ్రామ పంచాయతీ జలపవారిగూడెం ఎంపీయూపీ పాఠశాలకు డిప్యుటేషన్‌పై వస్తున్న లెక్కల మాస్టారు ముత్యాలరావు తమకొద్దంటూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండల అధికారులకు సైతం ఫిర్యాదు చేయడంతో సదరు ఉపాధ్యాయుడిని ఆ పాఠశాలకు వెళ్లకుండా ఆపేశారు. ద్వారకాతిరుమల ఎంపీ యూపీ పాఠశాల లెక్కల మాస్టారు ముత్యాలరావు విద్యార్థులను చితగ్గొడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయనకు షోకాజ్ నోటీసులిచ్చారు. పనిష్మెంట్‌లో భాగంగా ఆయన్ని దూరప్రాంతానికి పంపించకుండా సొంత మండలంలోని పాఠశాలకు పంపించడంపై పలువురు మండిపడుతున్నారు. విద్యాశాఖ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఈ ఉపాధ్యాయుడిపై ఇదేవిధంగా పలు ఫిర్యాదు అందాయని, అయినా ఆయన తీరు మారలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆగ్రహం

కొయ్యలగూడెం: పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సోమవారం స్థానిక జాతీయ రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ధరలను తగ్గింపుకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోగా విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచిందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని, అంబానీలతో విద్యుత్ చార్జీలపై చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాడిగడప ఆంజనేయరాజు, చెక్కిరెడ్డి సోమరాజు, కట్ట మహాలక్ష్మయ్య, బొబ్బర యేసు, రాంబాబు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలు రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం: అదాని కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయకులు కుంచె వసంతరావు, సుంకర రాధాకృష్ణ, వడ్లమనాటి శ్రీను, జగన్నాధ కృష్ణ, కూనపాముల విఘ్నేష్, బొక్కా శ్రీను, కొత్తూరు నాగేశ్వరావు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చింతలపూడిలో..

చింతలపూడి : అదాని కంపెనీలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ డి.ప్రమద్వరకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడారు. నాయకులు తుర్లపాటి బాబు, దొంతా కృష్ణ, ఎస్కే కాలేషా, ఎస్కే జానీ, తాడిగడప మాణిక్యాలరావు, తక్కెలపాటి ప్రసాద్‌రావు, ముహర్తా లక్ష్మణరావు పాల్గొన్నారు.

అదానీ అక్రమాలపై నిగ్గుతేల్చాలి

కుక్కునూరు: అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని కోరుతూ సీపీఐ కుక్కునూరు మండల సమితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. నాయకులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, నకిరికంటి నాగరాజు, వంజం విజయ్, సోమం మారయ్య తదితరులు పాల్గొన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శిగా మన్నవ యామిని ఎంపికపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ వర్కర్ల ధర్నా

జంగారెడ్డిగూడెం: ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. సమస్యలపై మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక మున్సిపాల్టీలో పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సమాన వేతనం రూ.32000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానం, అన్నిరకాల సెలవులు అమలు చేయాలని, అన్నిరకాల సదుపాయాలూ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, గౌరవ అధ్యక్షుడు జంపన వెంకటరమణరాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సుబ్రహ్మణ్యేశ్వరునికి వసంతోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరునికి వసంతోత్సవ వేడుక సోమవారం కనులపండువగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి పుష్పాలంకారాలు చేశారు. పూజలు చేసి హారతులిచ్చారు. స్వామి, అమ్మవార్లకు వసంతాలను సమర్పించారు. అనంతరం గ్రామోత్సవంలో అర్చకులు భక్తులపై వసంతాలను చల్లారు. మంగళవారం రాత్రి ఆలయంలో పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

చిన్నారుల తులాభారం

కొయ్యలగూడెం: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి తిరునాళ్లలో భాగంగా మూడో రోజు బయ్యనగూడెంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం చిన్నారులకు తులాభారం కార్యక్రమం నిర్వహించారు. సుమారు ఎనిమిది దశాబ్దాలుగా స్వామివారి ప్రాంగణంలో భారీ కాటా ఏర్పాటు చేసి అందులో తులాభారం వేస్తున్నారు. మొక్కుబడులు తీర్చుకొనేవారు తమ బరువుకు సమానంగా పటిక బెల్లం (బంగారం) స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం పటిక బెల్లాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు.



కొయ్యలగూడెం : చిన్నారులకు తులాభారం వేస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల : స్వామివారికి అభిషేకం

నిర్వాసితులకు న్యాయం చేయండి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో పలు ఫిర్యాదులు అందాయి. ఆర్డీఓ కార్యాలయ ఏఓ జీఎస్‌సీ శేఖర్ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 20 అర్జీల్లో అత్యధికం పోలవరం నిర్వాసితులకు సంబంధించినవి, మిగిలిన వాటిలో ఒంటరి మహిళ పింఛన్, భూ సంబంధిత సమస్యలు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ భూ నష్టపరిహారం తదితర సమస్యలు ఉన్నాయి. పోలవరం మండలం కోండ్రుపంచాయతీ కొత్తూరు గ్రామం ముంపునకు గురవడంతో తమకు కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఇచ్చారని, కాలనీలో తానున్న ఇంటిని వేరొకరికి కేటాయించారని, ప్రస్తుతం తనకు ఇల్లు కేటాయించాలని కొత్తూరుకు చెందిన ముత్యాల పోశమ్మ ఫిర్యాదు చేసింది. అప్పట్లో ఉన్నతాధికారులకు కొత్తూరు గ్రామంలో సుమారు 100 కుటుంబాలను అనర్హులుగా ప్రకటించారని, తరువాత రీ సర్వే చేసి అందరూ అర్హులే అని గుర్తించారని తెలిపింది. గతంలో తనకు కాలనీలో కేటాయించిన ఇంటికి నేటికీ విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను తానే కడుతున్నట్టు పోశమ్మ పేర్కొంది. ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని పోలవరం నిర్వాసితులు తాటి జానకి, ముళ్ల సీతాయమ్మ, కడబాల దేవమ్మ, చెదల దుర్గ, కట్టుమూరి ఆదిలక్ష్మి, కుంట్ల సుభద్ర, కుండ్ల ప్రసన్న, కల్లి సీతమ్మలు అర్జీ అందజేశారు.



ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న ముత్యాల పోశమ్మ

11 నుంచి రెవెన్యూ సదస్సులు

జంగారెడ్డిగూడెం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 2025 జనవరి 4వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. అర్జీపై ఏ విధమైన రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



వీఆర్ఓలతో సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్లీవజోజి

కామవరపుకోట మండలంలో..

కామవరపుకోట: ఈనెల 11 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జి.ఏలీసా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10న రావికంపాడులో నిర్వహించాల్సిన గ్రామ సదస్సు వాయిదా పడిందని, త్వరలో ఆ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. 11న ఉప్పలపాడు, 12న రామన్నపాలెం, 13న కొండగూడెం, 16న మంకినపల్లి, 17న ఈస్ట్ యడవల్లి, 18న రాజు నాగులపల్లి, 19న మైసన్నగూడెం, 20న గుంటుపల్లి, 21న కామవరపుకోట, 23న వడ్లపల్లి నూతనం, 27న కేఎస్ రామవరం, 28న కళ్లచెరువు, 30న పోలాసిగూడెం, 2025 జనవరి 2, 3, 4 తేదీల్లో తడికలపూడి, 6న వీరిశెట్టిగూడెం, 7న అంకాలంపాడులో ఆయా గ్రామా సచివాలయాలు, పంచాయతీల ఆవరణల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించన్నుట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీగా బొర్రా గెలుపుపై హర్షం

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి ఘన విజయం సాధించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. యూటీఎఫ్ ఏలూరు జిల్లా ఆడిట్ మెంబర్ అధ్యక్షతన పాఠశాల సమయం ముగిసిన అనంతరం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లోవకుమారి, యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ ఎంఏ నబీ, స్టాఫ్ సెక్రటరీ జగదీష్, సీనియర్ ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి మాట్లాడారు.

ఉపాధ్యాయుల సంబరాలు

ద్వారకాతిరుమల: ఎమ్మెల్సీగా గోపీమూర్తి గెలుపొందడంతో యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు సోమవారం స్థానిక యూటీఎఫ్ భవనం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. గోపీమూర్తి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ యూటీఎఫ్ మండల శాఖ ఉద్యమాభినందనలు తెలిపింది.

ఉద్యోగుల సమస్యలపై ధర్నా

ఏలూరు (టూటౌన్): సమస్యల పరిష్కారం కోరుతూ ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం భోజన విరామ సమయంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ ఉద్యోగ, సిబ్బంది ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పిలుపులో భాగంగా చేపట్టిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడారు. వాటర్ వర్క్స్, వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, సిబ్బందికి నెలకు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2022 మార్చిలో ప్రమోషన్ ఇచ్చిన 9 మంది డ్రైవర్లకు ప్రమోషన్ వేతనం చెల్లించాలని, తదితర సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల కన్నబాబు, బి.నాగేశ్వరరావు బి.నారాయణరావు, ఎస్ఎస్‌వీ సుబ్బారావు, ఎం దుర్గారావు, బి.పెద్దిరాజు, సోమేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్ హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో సుంకం చెల్లించని 30 తెలంగాణ మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు జంగారెడ్డిగూడెం సీఐ పి.శ్రీనుబాబు తెలిపారు. మద్యం కలిగి ఉన్న ఒక మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామన్నారు. తనిఖీల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నట్టు చెప్పారు.

రజక వృత్తి చెరువులను కాపాడాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజక వృత్తిచెరువులను ఆక్రమణల నుంచి కాపాడాలని రజకజన సంఘ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఏలూరులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సుమారు 200 చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని శెట్టిపేట గ్రామంలో రజకుల ఎకరం చెరువును ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేస్తున్నారని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు.

ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఈపీడిస్కమ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగిందని ఎన్నికల అధికారి, అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ పి.సన్యాసిరావు ఏలూరులో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సత్యప్రసాద్, జి.జోగి నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా జీఎస్ఎస్ పట్నాయక్ తెలిపారు.